రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

పొలిటికల్ ఫీవర్

# మిగిలింది 3 రోజులే

## ఆశావహులకు బిఫాం బెంగ



### జిల్లాలో ఆరు మున్సిపాల్టీల్లో ఎన్నికలు

### 962 నామినేషన్‌లు దాఖలు

### టికెట్ కోసం కాంగ్రెస్ నుంచే పోటీ అత్యధికం

### అభ్యర్థుల జాబితా ప్రకటించని ప్రధాన పార్టీలు

### గెలుపు గుర్రాలకు మాత్రం అనధికారిక లీకులు

### మిగిలిన ఆశావహుల్లో అయోమయం

### ఛాన్స్ రాకపోతే స్వతంత్రంగా పోటీకి వ్యూహాలు

**రంగారెడ్డి అర్బన్, జనవరి 31, ప్రభాతవార్త:** మున్సిపాలిటీల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసింది. నామినేషన్ అయితే వేశాం బి-ఫామ్ ఎవరిని వరిస్తుందోనని పార్టీల నేతల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికపై కసరత్తు పూర్తి చేసినప్పటికీ, అధికారికంగా ఏ పార్టీ కూడా ఇప్పటివరకు ప్రకటించలేదు. వివిధ కోణాలలో సర్వే అనంతరం ఎంపికయిన వారికి నేరుగా ఫోన్‌చేసి నామినేషన్ దాఖలు చేయాలని కీలక నేతలు సూచించినట్టు తెలుస్తోంది. దీంతో మిగిలిన ఆశావహుల్లో అయోమయం నెలకొంది. ఫిబ్రవరి 3వ తేదీలోగా బీఫాం అందజేయాల్సి ఉండటంతో మరో మూడురోజులు తర్వాత తమ వ్యూహాలను మార్చుకోవటానికి సమాయత్తమవుతున్నారు.

**చైర్మన్ రేసులో ఎవరెవరంటే..**

ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ పదవి రేసులో కాంగ్రెస్ నుంచి గుర్రం కేశవులు (9వ వార్డు) ప్రధానంగా ఉన్నారు. గతంలో ఆయన పంచాయితీ వార్డు సభ్యుడిగా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. స్థానిక రాజకీయాల్లో మంచి పట్టున్న నేతగా గుర్తింపు పొందారు. ఆయనతోపాటు టికెట్ ఆశిస్తున్న అప్పం శ్రీనివాస్‌కు (12వ వార్డు) ముఖ్యమంత్రితో సానిహిత్యం ఉండటం ప్రధాన బలంగా చెబుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి పోటీపడుతున్న నేనావత్ పత్యానాయక్ (6వ వార్డు) ప్రస్తుతం మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ అధ్యక్షుడిగా ఉన్నారు. గతంలో ఎంపిటిసిగా పనిచేశారు. రాజకీయంగా బలమైన నేపథ్యం ఉంది. మరో ఆశావహుడు పాపిశెట్టి రాము (5వ వార్డు)కు సంఘ సేవకుడిగా గుర్తింపు ఉన్నప్పటికీ రాజకీయ అనుభవం లేదు. బిజెపి నుంచి తల్లోజు గీత ఆచారి (3వ వార్డు - జనరల్) రాజకీయాల్లోకి కొత్తగా అడుగుపెడుతున్నారు. కండే హరి ప్రసాద్ (4వ వార్డు-జనరల్) కూడా రేసులో ఉన్నారు.

**శంకర్‌పల్లి మున్సిపాల్టీలో** జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి గతంలో బిఆర్‌ఎస్ నుంచి 14వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరఫున అదే వార్డు అభ్యర్థిగా ఉన్నారు. ఈసారి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. 15వ వార్డు నుంచి బిఆర్‌ఎస్ నుంచి బద్ధం శశిధర్ రెడ్డి చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. గతంలో టీఆర్‌ఎస్ పాలన సమయంలో ఆయన సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించి, ప్రజాసేవలో అనుభవం సంపాదించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

**ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ** విషయానికొస్తే.. చైర్మన్ పదవికోసం కాంగ్రెస్ పార్టీ నుండి ఏదుల్లా విజయలక్ష్మి జంగారెడ్డి, ఈర్లపల్లి సునీత వెంకట్ రెడ్డి, గుజ్జ స్వప్న నరసింహారెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ నుంచి టేకుల సుదర్శన్ రెడ్డి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.

**ధనబలం ఉన్న వారికే ప్రాధాన్యత**

జిల్లాలో ఆర్థిక బలం ఉన్న వారికే దాదాపు టికెట్ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో సీనియర్లను విస్మరిస్తున్నారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. టికెట్ దక్కని కొంత మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. టికెట్ ఆశిస్తున్నవారిలో అధికార కాంగ్రెస్‌లోనే ఎక్కువగా ఉన్నారు. ఒక వార్డు నుంచి ముగ్గురు, నలుగురు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి రెబల్స్ బెడద ఎక్కువగా ఉండే అకాశం ఉంది. అయితే కాంగ్రెస్ నాయకులు టికెట్ రాని వారికి నచ్చజెప్పే యత్నంలో ఉన్నారు.

మిగతా 2లో

# మాజీలూ.. కాస్త ఆగండి

# కొత్తగా రండి





### షాద్‌నగర్ మున్సిపాల్టీలో మారుతున్న ముఖచిత్రం

### కాంగ్రెస్‌లో అగ్గనూరు బ్రదర్స్‌లో ఒకరికే ఛాన్స్

### మూడు దశాబ్దాలు పుర పాలనలో విశ్వం ఫ్యామిలీ

### సర్పంచ్‌గా.. మున్సిపల్ చైర్మన్‌గా చక్రం

### సుదీర్ఘ కాలంగా పార్టీ సేవకే పరిమితమైన విశ్వం సోదరుడు బస్వం

### ఈ ఎన్నికలలో చైర్మన్ పీఠంపై దృష్టి

### అదే ఆలోచనలో అధిష్టానం

### తమ్ముడి కోసం త్యాగానికి సిద్ధమైన విశ్వం

### బిఆర్‌ఎస్‌లోనూ అదే సీన్

### మాజీ చైర్మన్ నరేందర్ నామినేషన్ విత్‌డ్రా చేయిస్తున్న అధిష్టానం

**ఒకరు దశాబ్దాల కాలంగా షాద్‌నగర్‌ను అటు సర్పంచ్‌గా, ఇటు మున్సిపల్ చైర్మన్‌గా ఏలగా.. మరొకరు ఒక విడత సర్పంచ్‌గా.. మరో విడత మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ మున్సిపాలిటీ ఎన్నికలకు దూరంగా ఉన్నారు.. సతీమణుల చేత నామినేషన్ వేయించి తాము మాత్రం పక్కకు జరిగారు.. గత మూడు దశాబ్దాలుగా మేజర్ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో వారి ముద్ర లేకుండా లేదు. ఈ విడత మాత్రం ఒకరు ముందే తప్పుకోగా.. ఇంకొకరు నామినేషన్ వేసినప్పటికీ విత్ డ్రా చేసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అధిష్టానం ఆదేశం ప్రకారమే వారు తెర వెనక రాజకీయానికి పరిమితమవుతున్నారా?**

**షాద్‌నగర్ టౌన్, జనవరి 31, ప్రభాతవార్త:** షాద్‌నగర్ మున్సిపాల్టీలో ఈసారి రాజకీయం కొత్తపుంతలు తొక్కుతోంది. ఏ ఎన్నికలు వచ్చినా ఎవరు చక్రం తిప్పారో..ఎవరు తమదైన మార్క్‌తో కీలక పాత్ర వ్యవహరించారో వారికే ఈసారి ఛాన్స్ మిస్ అవుతోంది. వీరిలో విచిత్రంగా ఒకరికి సోదరుడి రూపంలో అకవాశం గండిపడగా.. మరొకరికి పార్టీ అధిష్టానమే ఆశలను తుంచేసింది. వివరాలలోకి వెళితే.. షాద్‌నగర్ మున్సిపాలిటీలో విశ్వం అన్నగా పిలవబడే అగ్గనూరు విశ్వం కుటుంబ చరిత్ర పెద్దది. వీళ్ళ తండ్రి అగ్గనూరు రాచప్ప షాద్‌నగర్ మేజర్ గ్రామపంచా యతీ మొదటి సర్పంచ్ కాగా, ఈయన సతీమణి అగ్గనూరు విశాల చివరి సర్పంచ్.. ఇక 2014లో జరిగిన మొదటి మున్సిపాలిటీ ఎన్నికల్లో మొదటి మున్సిపల్ చైర్మన్‌గా

**కొత్తవాళ్లకే పగ్గాలు**

### లక్ష్మీప్రసన్న లేదా వెంకటరామిరెడ్డిపై బిఆర్‌ఎస్ చూపు

### కాంగ్రెస్ నుంచి బస్వం లేదా అందె మోహన్‌లకు చైర్మన్ అవకాశం

అగునూరు విశ్వంనే మరోసారి అవకాశం వరించింది. 65 సంవత్సరాల మేజర్ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ చరిత్రలో 38 సంవత్సరాల పాటు ఈ కుటుంబమే పాలించింది. అయితే గత, తాజా ఎన్నికల్లో మాత్రం అగ్గనూరు విశ్వం నామినేషన్ వేయలేదు. కానీ ఆయన తమ్ముడి కుమారుడు అగ్గనూరు బస్వం, విశ్వం సతీమణి అగ్గనూరు విశాల కూడా నామినేషన్ వేశారు. కానీ అసలైన నాయకుడు విశ్వం పోటీలో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఇక మున్సిపాలిటీ రెండవ చైర్మన్‌గా గత విడత పాలించిన కొందుటి నరేందర్ 90వ దశకం నుంచి పోటీలో ఉన్నారు. ఒక విడత ఎంపీటీసీగా, మరో విడత మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, మరోసారి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో

మిగతా 2లో

## కోటి విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

### మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్, సంపు హౌస్ నిర్మాణం

### ఫిర్యాదు చేసినా ప్రేక్షకపాత్రలో రెవెన్యూ యంత్రాంగం



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్, సంపు

**నందిగామ, జనవరి 31, ప్రభాతవార్త:** ఒకటా..రెండా..ఏకంగా సుమారు కోటి పైచిలుకు ఖరీదైన ప్రభుత్వ భూమిని నిలువునా కాజేశారు. నందిగామ మండలం రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 131 లో గల 1 ఎకరం 26 గుంటల ప్రభుత్వ భూమిలో సుమారు 15 గుంటల పైచిలుకు పక్కనే ఉన్న ఓ వెంచర్ యజమానులు ఆక్రమించినట్లు రంగాపూర్ సర్పంచ్ గోవు అంజమ్మ, ఉపసర్పంచ్ బస్వరాజు, రంగాపూర్, సాల్వెంద్రి గూడ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారమై స్థానిక రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని లాగేసుకుంటే ఏమోతుందో కూసింత కబ్జాదారుల్లో లేదంటే వారెంత బడాబాబులో అర్థమవుతుంది. ఇది ఇలాగే ఉంటే ఈ కబ్జా వ్యవహారం రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చిన ఇప్పటివరకు పటించుకున్నా పాపాన పోలేదని విచారం వ్యక్తం చేశారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి సర్వేర్ చేత సర్వే చేయించి కబ్జాకు గురైన భూమిని వెలికి తీయాలని మొరపెట్టుకుంటున్నారు. ఏది ఏమైనా గ్రామస్తులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

## కలెక్టరేట్‌లో ప్రజావాణి రద్దు

**రంగారెడ్డిఅర్బన్, జనవరి31, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

**షాద్‌నగర్, జనవరి 31, ప్రభాతవార్త:** ఎన్నికలు నిష్పాక్షి కంగా నిర్వహించడంలో భాగంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వాహనాల తనిఖీలు జరుగుతున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాస్, అదేవిధంగా ఫరూక్ నగర్ రెవెన్యూ సిబ్బంది కార్తీక్ అలాగే పలువురు పోలీసు సిబ్బంది కలిసి వాహనాలను ఇక్కడ ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు.

# కొడంగల్‌లో కాంగి రేసు



జగదీశ్వర్‌రెడ్డి

## మున్సిపల్ కుర్చీ కోసం వారసులు కుస్తీ

### బరిలో దిగిన మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి తనయుడు జగదీశ్వర్‌రెడ్డి

### తనకే కావాలంటున్న మాజీ చైర్మన్ జగదీశ్వర్

### చైర్మన్ రేసులో సిఎం సన్నిహితుడు ప్రశాంత్

### ఒకరికి చైర్మన్, మరొకరికి వైస్‌చైర్మన్ ప్రతిపాదనలో అధిష్టానం



ప్రశాంత్

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి /కొడంగల్):** దశాబ్దాల పాటు రాజకీయ ప్రత్యర్థులుగా కొనసాగిన ఆ రెండు కుటుంబాలు మరోసారి ఎన్నికల బరిలో దిగాయి. అప్పట్లో వేర్వేరు పార్టీల నుంచి పోటీ పడ్డారు. కానీ ఇప్పుడు ఒకే పార్టీ నుంచి తలపడుతున్నాయి. అప్పుడు అసెంబ్లీ సీటు కోసం కొట్లాడారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ కుర్చీ కోసం కుస్తీ చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారిన కొడంగల్ పట్టణంలో జరుగుతున్న ఈ పోరు సర్వత్రా ఆసక్తిదాయంగా మారింది.

సీనియర్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి తనయుడు జగదీశ్వర్‌రెడ్డి మరోసారి మున్సిపల్ ఎన్నికల బరిలో దిగారు. ఇప్పటి వరకు మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగిన జగదీశ్వర్ ఈసారి కూడా ఆ సీటు తనకే కావాలని పట్టుబట్టారు. కొడంగల్ మున్సిపాలిటీలోని ఒకటవ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్‌గా బరిలో దిగారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డికి కుడి భుజంగా కొనసాగుతున్న నందారం ప్రశాంత్ కూడా చైర్మన్ సీటు ఆశిస్తున్నారు. ఇదే పార్టీ నుంచి 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. దివంగత సీనియర్ మాజీ ఎమ్మెల్యే నందారం వెంకటయ్య మనవడైన ప్రశాంత్ 2009 నుంచి రేవంత్‌రెడ్డికి తోడుగా ఉంటున్నారు. ఆయన ఏ పార్టీలోకి వెళ్లినా ప్రశాంత్ వెన్నంటి ఉంటున్నారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఆయనకు వరిస్తుందని పార్టీ వర్గాలు భావించాయి. కానీ రెండేళ్లు గడిచినా పదవి ఊరిస్తూనే ఉన్నది. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు రావడంతో చైర్మన్ పదవి ఇవ్వాలని అధిష్టానం యోచించింది. అయితే, కాంగ్రెస్ పార్టీలో గుర్నాథ్‌రెడ్డి కుటుంబమే సీనియర్లుగా ఉన్నారు. కొంతకాలం పాటు టీఆర్‌ఎస్‌లోకి వెళ్లినా తిరిగి సొంతగూటికి వచ్చారు. కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. ఇద్దరూ బరిలో నిలుచున్నారు. చైర్మన్ సీటు తనకే దక్కుతుందని జగదీశ్వర్, ప్రశాంత్ ధీమాగా ఉన్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి ముందు స్పష్టం చేసినట్లు సమాచారం.

**కరవమంటే కప్పకు కోపం..**

సొంత పార్టీలో చైర్మన్ రేసులో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం గల కుటుంబీకులు ఉండటం అధిష్టానాన్ని ఇరకాటంలో పడేసింది. 'కరవమంటే కప్పకు కోపం..విడవమంటే పాముకు కోపం' నానుడి సరిగ్గా కాంగ్రెస్ అధిష్టానానికి అతుకుతుందని పార్టీవర్గాలు అంటున్నాయి. సీనియర్ మాజీ ఎమ్మెల్యే తనయుడు, సీనియర్ మాజీ ఎమ్మెల్యే మనవడు ఉండటం వల్ల ఇద్దరినీ బుజ్జగించే యత్నాలు సాగుతున్నాయి. అయితే, ఒకరికి చైర్మన్ సీటు, మరొకరికి వైస్‌చైర్మన్ సీటు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అందుకు ఇరువురూ ససేమిరా అన్నారని తెలిసింది. ఈ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చిందని అధినేతలు చెబుతున్నా ఫలితాలు వచ్చిన తర్వాత ఏదైనా జరుగవచ్చని భావిస్తున్నారు.



గుడి, ఘుడి అంటే పాలమూరు జిల్లాలో చాలామందికి సుపరిచితమే. కొడంగల్‌లో రాజకీయ పెద్దల కేరాఫ్ అడ్రస్‌లు అవి. 1972 అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన నందారం వెంకటయ్య అప్పట్లో రాజకీయాల్లో ఓ సంచలనం సృష్టించారు. ఆయన మూడుసార్లు

మిగతా 2లో



జగ్గంగూడ గురుకుల పాఠశాలలో కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాటును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## అధికారులంతా బిజీ బిజీ

### అందరి దృష్టి పుర పోరుపైనే..

### కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన అదనపు కలెక్టర్

### పిఓ,ఎపిఓలకు వరుస శిక్షణా శిబిరాల్లో కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 31, ప్రభాతవార్త :** జిల్లాలోని అధికార యంత్రాంగం అంతా మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలైంది. నిత్యం పోలింగ్ కేంద్రాల తనిఖీలు, ఎన్నికల సిబ్బంది శిక్షణ తదితర ఏర్పాట్లలో నిమగ్నమైపోతున్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల పిఓలకు,ఎపిఓలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణ విధులలో ఏవేని సందేహాలు ఉన్నా హ్యాండ్

మిగతా 2లో

### అభివృద్ధి చేశా.. ఆదరించండి : ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి

**శామీర్‌పేట, జనవరి 31, ప్రభాతవార్త :** అద్రాస్‌పల్లి గ్రామాన్ని తాను అభివృద్ధి చేసినట్లు, ఈ మున్సిపల్ ఎన్నికల్లోనూ బిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి సూచించారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అద్రాస్‌పల్లి గ్రామంలో రెండు వార్డులు ఉండటంతో బిఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం బిఆర్‌ఎస్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగ అద్రాస్‌పల్లి, ఎల్లంగూడెంకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు పార్టీ నాయకులు తెలిపారు. బిఆర్‌ఎస్‌లో చేరిన వారిలో నాయకులు ఎల్లం వెంకటేశ, ఎల్లందేవి రమేశ్, ప్రసాద్ పలువురు నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ అద్రాస్‌పల్లి గ్రామం అభివృద్ధి జరగాలంటే బిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అజయ్, నాగరాజులు బిఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్నట్లు, గ్రామాభివృద్ధి చేయటానికి ముందుకు వచ్చారని ఆదరించాలని గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమి లేదని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సరిగ్గా నెరవేర్చటం లేదన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సులు అన్నారు. గంటల పాటు బస్సుల కోసం మహిళలు ఎదురుచూస్తున్న పరిస్థితి దాపురించిందన్నారు



ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

## పిఎం జన్‌మన్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా వైద్యాధికారిణి స్వర్ణ కుమారి**

**కుల్కచర్ల, ప్రభాతవార్త జనవరి 31,ప్రభాతవార్త :** పిఎం జన్ మన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారి అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని రాంరెడ్డి పల్లిలో చెంచు కుటుంబాలను ఆమె సందర్శించి వారితో మాట్లాడారు.. చెంచు కుటుంబాలకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాలకు నేరుగా వైద్య బృందాలు వచ్చి వైద్యం, పరీక్షలు చేస్తాయని చెప్పారు. ఉచిత మందులు, పరీక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ క్యాంపుల ద్వారా ఉచితంగా ఔషధాలు, డయాగ్నోస్టిక్ పరీక్షలు అందుతాయి అన్నారు. ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత , ల్యాబ్ టెక్నీషియన్ రంజిత్, పీఎం జన్మన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను తీర్చిన సర్పంచ్

**అభినందించిన కాలనీవాసులు**

**నందిగామ జనవరి 31 ప్రభాతవార్త :** పాలకుడు సేవకుడిగా మారినప్పుడే జనం జేజేలు కొడతారు. సమస్యలున్న ప్రతి కాలనీలో ఎప్పటికప్పుడు స్పందిస్తూ జన హృదయ నాడిగా పనిచేస్తున్న సర్పంచ్ మంకాల శ్రీశైలం సేవలను కొనియాడు తున్నారు. నందిగామ మండలం చేగూరు గ్రామ పంచాయతీ 7 వ వార్డ్ లో మంచినీటి సమస్య నెలకొనడంతో స్పందించిన సర్పంచ్ వెంటనే బోరు మోటర్‌ను దింపి నీటి సమస్యను తీర్చారు. మంచి నీటి సమస్యను తీర్చిన సర్పంచ్ మంకాల శ్రీశైలం ఆ కాలనీ వార్డు సభ్యుడు పెద్ద శేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**పరిగి, జనవరి 31, ప్రభాతవార్త :** పరిగి మండలం, గడిసింగాపూర్ శివారులో శనివారం తెల్లవారుజామున రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న చౌదూర్ భీమయ్య అనే వ్యక్తిని పరిగి నుండి సి.బి.ఫైన్ మోటార్ వెహికిల్ పై అజాగ్రత్తగా,అతివేగంగా ఢీకొట్టగా బైక్ నడుపుతున్న బ్యాగరి శివ తలకు తీవ్ర గాయమై అక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న ప్రవీణ్ కుమార్ ఉస్మానీయా లో చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. బైకు పై వెనుకు కూర్చున్న నర్మద అనే యువతికీ, భీమయ్యలుకు గాయాలై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు , భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరిగి ఎస్ఐ మోహనకృష్ణ తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లు పరిశీలించిన అధికారులు

**దుద్యాల్, జనవరి 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల ు టిజిహెచ్సీఎల్ ఏఈ సుస్మిత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల ు కట్టుకోవాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు సంబందించిన బిల్లుల విషయంలో ఆందోళన చెందవద్దని, దశల వారిగా చెల్లింపులు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్య ప్రకాశ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మొగులప్ప, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్ లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలి

**మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**మేడ్చల్, జనవరి 31. ప్రభాతవార్త :** తెలంగాణను అభివృద్ధి చేసిన బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసిపార్టీ బలపర్చిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరారు. ఎల్లంపేట మున్సిపాలిటీలోని బండమాదారం, శ్రీరంగవరం, నూతన్‌కల్ గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను బిఆర్ఎస్ హయంలో అభివృద్ధి చేసి పేద ప్రజలకు ఇబ్బంది కలుగకుండా కనీస సౌకర్యాలు కల్పించిన మాజీ సిఎం కెసిఆర్‌దేనని అన్నారు. పదేండ్లలో చేసిన అభివృద్ధే తప్ప నేడు ఎలాంటి పనులు జరుగడం లేదని తెలిపారు. హామి ఇచ్చి మాట తప్పిన కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరిస్తున్నారని చెప్పారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరాదు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ వెంకట్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్యామల ప్రభాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నిషిత, రాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలి

**ఎల్లంపేటలో మున్సిపల్ బిజెపి సమన్వయ సమావేశం**

**మేడ్చల్, జనవరి 31. ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ వేసి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థులతో పార్టీ ముఖ్య సమన్వయ సమావేశం శనివారం సాయంత్రం ఎల్లంపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహాలు, పార్టీ బలోపేతం, ప్రచార విధానాలపై అభ్యర్థులను దిశా నిర్దేశ్యం కోసం సమావేశాన్ని జరిపారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని, పార్టీ గెలుపు కోసం సమిష్టిగా ముందుకు సాగాలని సూచించారు, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా పని చేయాలని తెలిపారు. కలిసికట్టుగా పని చేసి ఎల్లంపేట మున్సిపాలిటీలో విజయం సాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ రంగారెడినడ, రాష్ట్ర నాయకులు నందారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జగన్ గౌడ్, హంసరాణి, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, నాయకులు నర్సింహరెడ్డి, పోచయ్య, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కొడంగల్‌లో కాంగిరేసు

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ తరపున 1985, 1994లో వరస విజయాలు సాధించిన పెద్దాయన 1995లో ఆకస్మిక మరణం చెందారు. 1996లో జరిగిన ఉపఎన్నికల్లో ఆయన తనయుడు నందారం సూర్యనారాయణ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999లో టీటీడీ సభ్యులుగా సూర్యనారాయణ బాధ్యతలు నిర్వహించారు. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన నందారం కుటుంబం కొడంగల్‌పై చెరగని ముద్ర వేసుకున్నారు. అయితే, రాజకీయంగా ఎదుగుతున్న క్రమంలో సూర్యం బాబు రోడ్డు ప్రమాదంలో మృత్యు వాతపడ్డారు. ఆ తర్వాత నందారం కుటుంబీకులు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2009లో రేవం త్‌రెడ్డి రాకతో వెంకటయ్య మనవడు ప్రశాంత్ రాజకీ యాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఏనాడూ పదవులు ఆశించలేదు. వీరి కుటుంబీకులు కొడంగల్ పట్టణంలో నిర్మించిన తిరు మల తిరుపతి దేవస్థానం మాదిరిగా వెంకటేశ్వం స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచినది. తిరుమల ఆగమశాస్త్ర పండితులు ఇక్కడికి విచ్చేస్తుంటారు. దశాబ్దాలుగా పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తుంటారు. ధార్మిక సేవా కార్యక్రమా లలో తమదైన పాత్ర పోషించారు. పేదలకు వివాహాలు చేయడం, అన్న దానం వంటి సేవా కార్య క్రమాలు చేయడం వల్ల నందారం కుటుంబీకులకు 'గుడి' అని ప్రసిద్ధిగాంచారు. ఇదే నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన గురునాథ్‌రెడ్డి కూడా కొడంగల్‌పై చెరగని ముద్ర వేశారు. లింగాయతరెడ్డి సామాజికవర్గానికి చెందిన గురునాథ్ 1978, 1983, 1989, 1999, 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

హూందాగా వ్యవహరించే గురునాథ్‌రెడ్డి అధిష్టానానికి ఏనాడూ జీహుజూర్ అనలేకపోయారు. ఆయనకు మంత్రి పదవి ఏనాడో దక్కాల్సి ఉన్నా అధిష్టానాలు విస్మరించాయి. ఆయన 10 సార్లు ఎమ్మెల్యేకు పోటీ చేశారు. 8 సార్లు నందారం కుటుంబీకులతోనే పోటీ పడ్డారు. కొడంగల్‌లో పెద్ద కోట ఉంటుంది.

గురునాథ్‌రెడ్డి కుటుంబంలో అందులోనే నివాసం ఉంటుంది. కోటను ఉర్దూలో ఘడీ అంటారు. పెద్దాయన ఘడీ నుంచే రాజకీయాలు నడుపుతుంటారు. కొడంగల్ పరిసరాల ప్రజలు ఆయనను ఇప్పటికీ 'దొర' అని పిలుస్తుంటారు. ఎమ్మెల్యేగా ఐదుసార్లు గెలుపొందినా హైదరాబాద్ క్వార్టర్స్ లో పెద్దగా ఇష్టపడేవారు కాదు. చాలా పెద్ద కుటుంబం వారిది. అదే కుటుంబం నుంచి కొడంగల్ ఎంపీపీలుగా, సర్పంచ్‌లుగా ఎన్నికైనారు. గడచిన ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్‌గా కూడా గురునాథ్‌రెడ్డి తనయుడు జగదీశ్వర్‌రెడ్డి పదవి చేపట్టారు. ఈసారి కూడా రంగంలోకి దిగారు. ప్రస్తుతం గురునాథ్‌రెడ్డి రాష్ట్ర పోలీస్ హౌజింగ్‌బోర్డు చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

# కనులపండువగా శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం



ఎదులాబాద్‌లో శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న ధర్మకర్తలు



వేణుగోపాలస్వామి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో శనివారం శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నిత్యం గీతాయజ్ఞాది పూజా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా పుణ్యహవాచనము, అక్షర పరబ్రహ్మ, రాజవిద్య, రాజగుహ్య, విభూతియోగ అధ్యాయము హవనం, నిత్యపూర్ణాహుతి, సేవాకాలము, ప్రోభోధకి ఆరగింపు, స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కళ్యాణ మండపాన్ని అంబారీపేట వంశ ధర్మకర్తలు, అర్చకులు వివిధ రకాల పూలతో అలంకరించి స్వామి కళ్యాణం జరిపించారు. అంతకుముందు పల్లకిలో ఉత్సవమూర్తులను గోవిందనామ స్మరణ, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు జరిపారు. కళ్యాణ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛారణాల మధ్య శ్రీవేణు గోపాలస్వామి, రుక్మిణీ, సత్యభామ ఉత్సవమూర్తులకు కళ్యాణం నిర్వహించారు. పలువురు దంపతులు విచ్చేసి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎదులాబాద్ నుంచే కాక హైదరాబాద్ నగరం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి కళ్యాణం తిలకించారు. ఈసందర్భంగా ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అంబారీపేట వంశస్థులు ఉత్సవాల్లో కళ్యాణోత్సవం సందర్భంగా తగిన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం కళ్యాణ మండపంలో సహస్ర దీపాలంకరణసేవ ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా భక్తదాతలు ఆలయానికి భారీగా విరాళాలు సమర్పించుకున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్వామి విమాన రథోత్సవం నిర్వహిస్తామని, రథంపై ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగిస్తామని భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ధర్మకర్తలు కోరారు. ఈకార్యక్రమంలో ధర్మకర్తలు అంబారీపేట్ అప్పలాచార్యులు, మురళీకృష్ణాచార్యులు, వరదరాజుచార్యులు, రాంప్రసాద్‌చార్యులు, ఏవీఎల్ఎన్ చార్యులు, వేణుగోపాలాచార్యులు, బుచ్చమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రాఘవాచార్యులు, నారాయణచార్యులు, బద్రినారాయణచార్యులు, రాజగోపాలాచార్యులు, మాజీ సర్పంచ్ బట్టె శంకర్, మాజీ ఎంపిటిసి మంకం రవి, న్యాయవాది వై.శ్రీనాథరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై కాంగ్రెస్, బిఆర్ఎస్ రాజకీయ డ్రామాలు

**-జిహెచ్ఎంసి ఎన్నికల నేపథ్యంలో పేరు కోసం పాకులాట**

**-ఇరుపార్టీల నేతలపై బిజెపి విమర్శలు**

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్‌లో నెలకొన్న ప్రజాసమస్యలపై అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్‌పార్టీల నాయకులు రాజకీయంగా లబ్ధిపొందడానికి డ్రామాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిపాల్‌రెడ్డి బిజెపి నాయకులతో కలిసి మాట్లాడుతూ పట్టణంలో సమస్యలపై బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల వ్యవహారశైలిని తప్పుబట్టారు. రైలుట్రాక్‌పై కేంద్రప్రభుత్వం ఇనుముతో వంతెన పూర్తి చేసి దశాబ్దం కాలంకు పైగా అవుతుందని రాష్ట్రంలో అధికారంలో 15 సంవత్సరాలుగా కొనసాగిన బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇరువైపులా వంతెన, సర్వీస్‌రోడ్లు నిర్మాణం చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి సకాలంలో నిర్వాసితులకు తగిన నష్ట పరిహారం అందించడంలో దశాబ్దకాలంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యధోరిణి అవలంబించాయని ఆయన విమర్శించారు.

## షాద్ నగర్‌లో కాంగ్రెస్ బిఆర్ఎస్ అభ్యర్థులు వీరే ?

**షాద్ నగర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** షాద్‌నగర్ మున్సిపాలిటీ పీఠం కోసం ఎన్నికల్లో పోటీ చేసేందుకు బరిలో దిగిన ముఖ్య నాయకులకు సంబంధించిన పేర్లు అన్నదికారికంగా మీడియాకు లభించాయి. దాదాపు ఇవే పేర్లు ఫైనల్ అయినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. షాద్ నగర్‌లో మొత్తం 28 వార్డులకు 244 నామినేషన్లు వచ్చాయి.శనివారం స్క్రూటి ని నిర్వహించగా 147 నామినేషన్లు మాత్రమే అధికారులు ఫైనల్ చేశారు. 147 మంది అభ్యర్థుల నామినేషన్లకు గ్రీన్ సిగ్నల్ లభించిందని ఎన్నికల అధికారి కమిషనర్ సునీత రెడ్డి తెలిపారు. ఇక వార్డుల వారీగా అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి జాబితా ఈ విధంగా ఉంది. స్వల్ప మార్పులు తప్ప దాదాపు ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది.

1 వ వార్డు గౌస్ ఎంఐఎం (కాంగ్రెస్ మద్దతుతో), 2 వ వార్డు కొంకళ్ళ చెన్నయ్య, 3 వ వార్డు ఆలోనిపల్లి రాజు, 4 వ వార్డు చేగూరు పుష్పమ్మ, 5 వ వార్డు సింగపాగ శిరీష, 6 వ వార్డు రాజు నాయక్, 7 వ వార్డు కొప్పునూరి ప్రవీణ్, 8 వ వార్డు జయ ప్రకాష్ గౌడ్, 9 వ వార్డు గోద మాధవులు,10 వ వార్డు కావలి శ్రావణి,11 వ వార్డు గుడిపల్లి బీరప్ప,12 వ వార్డు కలంకార్ దిలీప్, 13 వ వార్డు రిజ్వానా బేగం,14 వ వార్డు అందే మోహన్, 15 వ వార్డు వీరమోని అర్చన,16 వ వార్డు వన్నాడ లావణ్య , 17 వ వార్డు నాజియా బేగం,18 వ వార్డు జమాల్పూర్ సంతోషి, 19 వ వార్డు ఆఫ్రిన్ బేగం, 20 వ వార్డు డాకన్నగారి మనీష్, 21 వ వార్డు నాగమణి, 22 వ వార్డు అర్జున్ లక్ష్మణ్, 23వ వార్డు అగ్గనూరు బస్వం, 24 వ వార్డు అగ్గనూరు విశాల విశ్వం, 25 వ వార్డు పెంటయ్య, 26 వ వార్డు జామ మంజుల, 27వ వార్డు మురళీమోహన్ (అప్పి), 28 వ వార్డు కాటం భాగ్యలక్ష్మి ౖ గౌడ్ బీఆర్ఎస్ లో ఇలా.. 1 వ వార్డు యూసఫ్ ఖాన్ లేదా గౌస్ జానీ, 2 వ వార్డు చెట్ల నరసింహ, 3వ వార్డు నందారం అశోక్ యాదవ్, 4 వ వార్డుచల్లా వాణి పాండురంగారెడ్డి, 5 వ వార్డు అశ్విని ప్రవీణ్ , 6 రాజేందర్ సింగ్, 7 వ వార్డు సుధీర్ లేదా ఈశ్వర్ రాజు, 8 వ వార్డు బిక్షపతి, 9 వ వార్డు చేగూరి వేణుగోపాల్, 10 వ వార్డు చెరక అఖిల శివ, 11 వ వార్డు పిల్లి శారద శేఖర్, 12 వ వార్డు ఎమ్మెస్ నటరాజన్, 13వ వార్డు కొండలక్ష్మీ ౖ మల్లేష్, 14 వ వార్డు బచ్చలి నరసింహ,15 వ కొందూటి మహేశ్వరి,16 వ వార్డు ఒగ్గు జయలక్ష్మీ ౖ కిషోర్, 17 వ వార్డు గౌసియా బేగం సలీం, 18 వ వార్డు ప్రేమలత యుగంధర్, 19 వ వార్డు అరిఫా బేగం అద్దు, 20 వ వార్డు పిన మోని గోపాల్, 21 వ వార్డు జీటి వసంత శ్రీను, 22 వ వార్డు నడికూడ అనిత రఘునాథ్ లేదా అందె సరిత ఆంజనేయులు లేదా నడికూడ అశోక్, 23వ వార్డు వెంకట్రాంరెడ్డి, 24 వ వార్డు కే.మహేశ్వరి/ఈశ్వర్ రాజు /జయంతి రాఘవేందర్, 25 వ వార్డు నక్కల వెంకటేష్, 26 వ వార్డు ఎస్పీ శివ, 27 వ వార్డు జూపల్లి శంకర్, 28వ వార్డు లక్ష్మీ ౖ ప్రసన్న వేణు నామినేషన్లు

## మిగిలింది మూడు రోజులే

(మొదటి పేజీ తరువాయి)

వారికి ఇతర పదవుల అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చే యోచనలో ఉన్నారు. కొందరు అభ్యర్థులకు వార్డుల్లో రిజర్వేషన్లు కలిసి రాకపోవడంతో వారిని ఇతర వార్డులకు సర్దుబాటు చేస్తున్నారు.

జిల్లాలలో ఆరు మున్సిపాలిటీలలో 126 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. 962 నామినేషన్‌లు రాగా.. ఇందులో ఆమన్‌గల్‌లో 109 , చేవేళ్లలో 133, ఇబ్రహీపట్నంలో 192, మొయినాబాద్‌లో 184 , షాద్‌నగర్‌లో 244, శంకర్‌పల్లిలో 100 నామినేషన్‌లు చొప్పున ఉన్నాయి. దీంతో టికెట్ కోసం పోటీ తీవ్రంగా ఉన్నట్లు అర్థమవుతోంది.

దీర్ఘకాలంగా ఆశలు పెట్టుకున్నవారికి కొత్త సమీకరణాలతో టికెట్ ఇచ్చే పరిస్థితి కనిపించటంలేదు. దీంతో ఆశావహులు వేరే దారులు వెతుక్కుంటున్నారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్‌లో టికెట్ దక్కకుంటే స్వతంత్రంగా బరిలో నిలవాలని పలువురు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. వార్డుల్లో ప్రజాబలం ఉన్న తమను అధినాయకులు గుర్తించకపోతే.. పోటీకి దిగి తమ సత్తా నిరూపించటం ద్వారా హైకమాండ్‌ను ఆకర్షించాలని పట్టుదలతో కొంతమంది నేతలు ఉన్నట్లు తెలుస్తోంది.

**-రిజర్వేషన్లు మారడంతో ఇబ్బందులు**

మునిసిపల్ వార్డుల రిజర్వేషన్లు మారడంతో కొందరు ఆశావహులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా వార్డుల్లో పోటీ చేయాలని ముందుగానే భావించి కొంతకాలంగా సేవలందించిన వారికి రిజర్వేషన్లు కలిసిరాలేదు. వారికి ఇతర వార్డుల్లో రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్నా, అక్కడ పోటీచేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అంతే గాక ఆ వార్డుల్లో స్థానికులు ఉండడంతో ఇతర వార్డుల నుంచి వచ్చి పోటీ చేసే వారికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కొంత మంది అభ్యర్థులు పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు ఇతర వార్డులో నామినేషన్ దాఖలు చేశారు. కొంత మంది ఆశావహులు పోటీ నుంచి విరమించుకుంటున్నట్టు మద్దతుదారులతో చెప్పినా, చివరి రోజు అనూహ్యంగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు పరిశీలన అనంతరం ఉపహరణ నాటికి పోటీలో ఉండే వారెవరో తేలనుంది.

## కార్యకర్త అంతిమ యాత్రలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జనవరి 31. ప్రభాతవార్త :** బిఆర్ఎస్ కార్యకర్త అంతిమ యాత్రలో మేడ్చల్ ఎమ్మెల్యే పాల్గొ న్నారు. ఎల్లంపేట మున్సిపా లిటీ లోని సైదోనిగడ్డ తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మోహన్ నాయక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా విషయాన్ని తెలు సుకున్న ఎమ్మెల్యే శనివారం తండాకు వెళ్లి అతని అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

# మాజీలూ..కాస్త ఆగండి

(మొదటి పేజీ తరువాయి)

భంగపడిన ఆయన టిఆర్ ఎస్‌లో చేరి చైర్మన్ స్థానాన్ని అధిష్టించారు. ఈ విడత కూడా చైర్మన్ రేస్‌లో ఉండాలని ఆశపడినా... అగ్ర నేతలు కొత్తవారికి అవకాశం ఇచ్చే పరిస్థితి ఉండడంతో చేసేది లేక కౌన్సిలర్ పదవికి 25వ వార్డు నుంచి నామినేషన్ వేశారు. అదే వార్డు నుంచి నక్కల వెంకటేష్ గౌడ్ పోటీలో ఉండడంతో నరేందర్‌ను పోటీ నుంచి తప్పుకోవాలని అధిష్టానం సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన నామినేషన్ ఉపసంహరించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు నరేందర్ సతీమణి మహేశ్వరి బిఆర్ఎస్ తరపున 15వ వార్డు నుంచి నామినేషన్ దాఖలు చేశారు.

**చైర్మన్ అభ్యర్థులు వీరే?**

ఈసారి బిఆర్ఎస్ నుండి కట్టెల వేణు సతీమణి లక్ష్మీ ౖ ప్రసన్న (28వ వార్డు), లేదా ఈగ వెంకటరామిరెడ్డి (23వ వార్డు)కు చైర్మన్ గిరీ అవకాశం ఉండవచ్చన్న చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్‌లో 23వ వార్డు నుంచి నామినేషన్ వేసిన అగ్గనూరు బస్వం, 14వ వార్డు నుంచి బరిలో నిలిచిన అందె మోహన్‌లను చైర్మన్ పీఠం వరించే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది.

**బస్వంపై సానుభూతి**

దశాబ్దాల కాలంపాటు షాద్‌నగర్‌ను అటు సర్పంచ్‌గా, ఇటు మున్సిపల్ చైర్మన్‌గా ఏలిన అగ్గనూరు విశ్వం ఈసారి బరిలో లేకపోవటానికి ఆయన తమ్ముడు అయిన బస్వం మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశిస్తుండటమే కారణంగా తెలుస్తోంది. బస్వం సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌నే అంటిపెట్టుకుని ఉన్నారు. అన్నబాటలో పార్టీకి సేవచేయటమే మినహా రాజకీయంగా పదవులు ఆసించిన సందర్భాలు లేవు. ఈఎన్నికలలో తాను ఆ కీలక అవకాశం తీసుకోవాలని ఆశించటంతో ఒకే కుటుంబంలో పోటీ ఉండకూడదని భావించిన విశ్వం తాను రేసు నుంచి తప్పుకున్నట్టు తెలుస్తోంది.

**కొత్త ముఖాలకు ఛాన్స్ ఇవ్వాలనే...**

ప్రస్తుతం షాద్‌నగర్‌లో రాజకీయ వర్గాల్లో అటు విశ్వం, ఇటు నరేంద్రల పాత్రపైనే చర్చ జరుగుతోంది. ప్రతి ఎన్నికల్లో ఉత్సాహంగా బరిలో నిలిచే ఇద్దరు ఈసారి లేకపోవడం విస్మయంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.



## విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా గుర్తింపు లభిస్తుందని విబిఐటి ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎస్ శ్రీనివాస్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ సమీపంలోని విజ్ఞానభారతీ ఇంజనీరింగ్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఆయన ఇంటర్నల్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మైదానంలో మొదటి బ్యాచ్ ఇరుజట్ల క్రీడాకారులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీడీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కరచాలనంతో పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌ను మొదలుపెట్టారు. అంతర్ తరగతుల క్రికెట్ లీగ్ టోర్నమెంట్ పోటీలు శనివారం నుంచి జరుగుతాయని క్రీడాకారులు బాగా ఆడుతూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆయన సూచించారు.

## దేశవ్యాప్తసమ్మెపై డిసికి నోటీసు అందజేత

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 12వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక నాయకులు పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ కార్యాలయం ముందు శనివారం కార్మికుల సమసనయలను పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. 12న జరిగే సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని వారుకోరారు. అనంతరం సర్కిల్ డీసీ వాణిని కలిసి సమ్మె నోటీసును అందజేసి సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎఐటియూసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయ చంద్ర, సిఐటియు మండల కార్యదర్శి చింతల యా దయ్య, సిపిఎం మండల కార్యదర్శి నార్కట్‌పల్లి సభిత, సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, సిఐటియు జిహెచ్ఎంసి వర్కర్స్ యూనియన్ సర్కిల్ అధ్యక్షులు అశోక్, కార్యదర్శి చంద్రమౌళీ, ఏఐటియూసి జిహెచ్ఎంసి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంచందర్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

## అధికారులంతా బిజీ బిజి

(మొదట పేజీ తరువాయి)

బుక్ ద్వారా, జోనల్ ఆఫీసర్లతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణా తరగతులను అర్థం చేసుకుని ఎన్నికల విదులకు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణమైన అవగాహనను ఏర్పరుచుకోవాలని అన్నారు. మొత్తం ఓటింగ్ లెక్కలు సరిగ్గా నిర్ధారించుకోవాలని, అందులో ఆడ,మగ ఓటర్ల లెక్కింపులో తప్పు లేకుండ రిజిష్టర్‌తో పాటు ట్యాలీ అయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ప్రతి ప్రోఫార్మా ముఖ్యమైనదని అన్నారు. అందులో ప్రతి ప్రొఫార్మా పూరించి జాగ్రత్తగా అందించాలన్నారు. ఎవరితోనూ వాదనలు చేయకుండ ప్రశాంతంగ ఓటింగ్ పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఏదైనా సమస్యాత్మకంగా అనిపిస్తే పోలీసు వారికి, జోనల్ ఆఫీసర్లకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ బూతులలో అవసరమైన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రెనింగ్ నిర్వాహణ నోడల్ అధికారి విజయ కుమారి, మాస్టర్ ట్రైనీలు మురళీ, వేణు, పిఓలు,ఎపిఓలు తదితరులు పాల్గొన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ సెంటర్‌ను ,స్ట్రాంగ్ రూమ్‌ను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. జగ్గంగూడలో ఉన్న తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల కౌంటింగ్ సెంటర్‌ను, స్ట్రాంగ్‌రూమ్‌ను ఆయన సందర్శించి పరిశీలించారు.

# విశ్వేశ్వరగిరి క్షేత్రంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

**-నేడు చండీహోమం..శివపార్వతుల కళ్యాణం**

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీవిశ్వేశ్వరగిరి (హరిహర) క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా 3వరోజు శనివారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, అష్టాక్షరీ హోమం, శ్రీనివాస స్వామి కళ్యాణం అర్చకుల మంత్రోచ్ఛారణాల మధ్య నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా అర్చకులు వారికి తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి మహాసరస్వతి సమేత రాజ రాజేశ్వరదేవికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, చండీ హోమం, శివపార్వతుల కళ్యాణం జరుగుతుందని భక్తులు పాల్గొనాలని పీఠాధిపతి ఆత్మానందభారతీస్వామి కోరారు.



# ప్రజలకు ఇబ్బంది కల్గకుండా బిటి రోడ్డు వేయండి

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** యంనంపేట్ చౌరస్తా నుంచి చేపట్టిన హెచ్ఆర్‌డిసిఎల్ రోడ్డు పనుల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా నిర్వహించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. డానో కంపెనీ ముందు శనివారం ఆమె బీటీ రోడ్డు పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. బిటి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటిస్తూ జాప్యం చేయకుండా వాహన దారులకు, పాదచారులకు ఇబ్బంది కల్గకుండా పనులు పూర్తి చేయాలని ఆమె సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఎక్కడ కూడా గుంతలు పడకుండా దుమ్ము, దూళీ వ్యాపించకుండా బిటి రోడ్డు పనులను పట్టణంలో పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా వేణుగోపాల్‌రెడ్డి

**శామీర్‌పేట, జనవరి 31, ప్రభాతవార్త:** అలియాబాద్ మున్సిపాల్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా వేణుగోపాల్‌రెడ్డి నియమితులు కావటంతో నియామక పత్రాన్ని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అందజేశారు.

## చదువుతో పాటు సంస్కారం అవసరం

**ఎంపి ఈటల రాజేందర్**

**శామీర్‌పేట, జనవరి 31, ప్రభాతవార్త**

విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం అనేది కూడ ముఖ్యమని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సూచించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని విజన్ హైస్కూల్ 7వ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగ ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు మార్కులు అనే కాకుండ చదువుతో పాటు సంస్కారం అనేది కూడ కీలకమన్నారు. విద్యార్థుల చదువును బట్టి వందకు వంద మార్కులు అనేవి కాకుండ పెద్దలను, గురువులను గౌరవించటం దేశభక్తిని విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మిర్యాల సతీష్‌కుమార్, రీణ, డైరక్టర్‌లు శ్రీకాంత్, మహేశ్, గంగా నర్సయ్య, సాధన, అనిత, టీచర్లు, విద్యార్థులు, జిల్లా బిజెపి కార్యదర్శి వి.సుదర్శన్, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి రద్దు

**కలెక్టర్ మనుచౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 31, ప్రభాతవార్త :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా కోడ్ ఉన్నందున మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు. తెలంగాణ వ్యాప్తంగ మున్సిపల్ సాదారణ ఎన్నికలు-2026 ఉన్నందున ఎన్నికల నియమావళిని పాటించవలసి ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించటం లేదని జిల్లా ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-X ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT: MEDCHAL

O.S. No. 917 OF 2025

BETWEEN:
Vivekanand Sangam
Vanita S. Sangam
Vinayak Sangam ...Petitioners

AND

1. M.R.O, BACHUPALLY
2. ALL CONCERNED ...Respondents

To
1. The Tahsildar, Bachupally Mandal, Medchal-Malkajgiri District.
2. All Concerned. ...Respondents 1 and 2

Please take notice that the above matter is posted to 16-02-2026 for your appearance either in person or through an advocate before the above Court on the above date by 10.30 AM, failing which you will be set ex parte and the Court will decide the matter in your absence.

(BY ORDER OF THE COURT)

N. AISHWARYA
ADVOCATE
ADDRESS FOR SERVICES
O/o. SR Mansion, Pragathi Nagar, Kukatpally, JNTUH-500090
MOB. No. 9390351729

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి జనవరి 31,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామానికి చెందిన రాజమోని ఈదమ్మ(60), శుక్రవారం నాడు మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ. 3వేలు, దేవునిపడకల్ గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ వారినీ పరామర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓ దార్చి వారికీ రూ. 3వేలను ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కుమ్మరి శంకర్ , ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్ , వార్డు సభ్యులు కడమోని రాము, అంబటి లక్ష్మయ్య, రాజమోని జ్యోతి మంజుల లక్ష్మయ్య, రాజమోని మంజుల శ్రీనివాస్, మద్దూరి సత్యం, జలా జంగయ్య, పద్మ ఆంజనేయులు, రాజమోని రవి, అంబటి నర్సింహా పద్మ యాదయ్య, అంబటి లింగయ్య పద్మ రామస్వామి, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## విజయవంతంగా ముగిసిన గ్రామసభ

**తలకొండపల్లి జనవరి 31,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో గ్రామసభ సమావేశం గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామసమస్యలు మరియు పారిశుద్ధంపై, గ్రామానికి ఇరువైపులా రోడ్లు మరియు వీధిలైట్లు, ఉపాధిహామీ పనులపై కమిటీ గురించి గ్రామసభలో చర్చించడం జరిగింది. గ్రామంలోని సమస్యలన్నిటిపై గ్రామసర్పంచ్ మాట్లాడుతూ... ప్రతి సమస్యను కచ్చితంగా తీర్చి గ్రామంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తానని గ్రామ ప్రజలందరి ముందు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మలశ్రీశైలం యాదవ్ గారు, ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు , గ్రామ సెక్రెటరీ రమేష్ నాయక్ , ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ , వార్డు సభ్యులు మిద్దెల భార్గవినందు, సప్పిడి సునీతకృష్ణయ్య, దొరుబాయి లాలమ్మజంగయ్య, కటికల మధు యాదవ్, తిక్కల జంగయ్య, వట్టెల చంద్రకళసుధాకర్, కాకి రామచంద్రయ్య, శి నరేష్, శి రమేష్, గ్రామ మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఎంపిటిసి యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ యెన్నం మోహన్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు, గ్రామ పెద్దలు: పెద్ద హరి మోహన్ రెడ్డి, మజీద్, చిన్న హరి మోహన్ రెడ్డి, పోలే రామయ్య, సలీం, శర్ఫుద్దీన్, యువ నాయకులు: చిలుకం శేఖర్, బోదాస్ నరసింహ, పబ్బా సంపత్ కుమార్, రొయ్యల మహేష్, రీ.శి. శ్రీశైలం, మహేష్, చిన్నయ్య, నవీన్, ఉపాధి హామీ కార్మికులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



రాంపూర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి

**తలకొండపల్లి జనవరి31, ప్రభాత వార్త:** ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన సహదేవ్ సముద్రంలో జరిగింది. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం..తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన వద్దే బాలమ్మ (60) శుక్రవారం రోజు సహదేవ్ సముద్రంలో చేపలకు వెళ్తానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటినుంచి వెళ్ళిపోయింది. చీకటి పడిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికిన ఆచూకీ కనిపించలేదు. శనివారం మధ్యాహ్నం చెరు వులో ఒక ఆడమనిషి శవం స్థానికులకు కనిపించగా వెంటనే వాళ్ళ కుటుంబ సభ్యులకు తెలుపగా సంఘటన స్థలానికి చేరుకొని నీటిపై తేలాడుతున్న మృతదేహాన్ని బయటకు తీయడంతో వెల్జాల్ గ్రామానికి చెందిన బాలమ్మ గా గుర్తించారు. మృతురాలు యొక్క పెద్ద కుమారుడు వెంకటయ్య ఫి ర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలకొండపల్లి ఎస్ఐ ఎ.శ్రీకాంత్ తెలిపారు.



చెరువులో పడి మృతి చెందిన బాలమ్మ

ఆడుకుంటూ వెళ్ళి బావిలోపడి..

## ఒకరు మృతి, ప్రాణాలతో బయటపడ్డ మరో విద్యార్థి

**మర్పల్లి, జనవరి 31, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు ఇద్దరు అన్నతమ్ములు బావిలో పడి ఒకరు మృతి చెందగా మరొకరు ప్రాణాలతో బయటపడిన సంఘటన మర్పల్లి మండలంలోని కొంషే ట్‌పల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సయిజోద్ధీన్ ఉమేర బేగంకు నలుగురు సంథానం ఇందులో రెండవ సంతానం సైఫాన్, సాహీల్ ఇద్దరు అన్నతమ్ములు శనివారం రోజు వారి తల్లిదండ్రులు ఇతర గ్రామానికి వెళ్లడంతో పాఠశాలకు దుమ్మాకొట్టి ఆటలాడు కొనేందుకు పొలాల బాట పట్టారు. ఆటలాడుతూఉండగా ప్రమాదవశాత్తు ముందుగా సాయిల్ బావిలో పడగా రక్షించేందుకు యత్నించిన అన్న సైఫాన్ కూడ బావిలో పడ్డాడు. ఎంతకూ తన తమ్ముడు సాహీల్ బావిలో పడి బైటకు రాకపోవడంతో పక్కనే ఉన్న ఓ చెట్టుకొమ్మను పట్టుకొని కేకల్ వేశాడు. దీంతో వ్యవసాయ బావికి సమీపంలో ఉన్న ఓ మహిళ అదే పొలం పక్కనుండి ఇంటికి వెళ్లుతున్న ఉపాధీ కూలీలకు సమాచారం ఇవ్వడంతో కూలీలు నీటిలో దూకి సైఫాన్ కాపాడగా తమ్ముడైన సాయిల్ మృతి చెందాడు. దీంతో స్థానికులు బావిలో ఉన్న నీటిని మోటార్ల ద్వారా తోడి సాహీల్ శవంను బైటకు తీశారు.



మృతి చెందిన సాహీల్ మృత్యుంజయుడు సైఫాన్

## శివాలయం ధ్వజస్తంభం ఏర్పాటుకు ఆర్థిక సహాయం

**షాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని ముద్దేం గూడ, మల్లారెడ్డి గూడ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న లింగ మూర్తి ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు పరిగి శేఖర్ గౌడ్, పరిగి గణేష్‌గౌడ్‌లు శనివారం ఆలయ కమిటీ సభ్యులకు రూ. 2 లక్షల 80 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దేంగూడ గ్రామసర్పంచ్ పరివేద నర్సింలు, 42 శాతం బిసి రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు రాపోలు నర్సింలు, ఉపసర్పంచ్ సిద్దాపురం శివకుమార్, మల్లారెడ్డి గూడా మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు పెదేటి జంగయ్య, ఆంజనేయులు, సంజీవ, సుదాకర్, రంగం శ్రీకాంత, పురుషోత్తం, సత్యనారాయణ, తుల్చయ్య, ఒగ్గు మల్లేష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



లింగమూర్తి ఆలయానికి ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

## కొడంగల్‌లో కొనసాగుతున్న పట్టణ భూ సర్వే

**కొడంగల్, జనవరి 31ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనసాగుతున్న నక్ష (పట్టణ భూ సర్వే)కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 5వ వార్డులో సర్వే పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేల్యాండ్ రికార్డు జిల్లా సహాయ సంచాలకులు మధుసుదన్ సర్వే జరుగుతున్న ప్రదేశంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తయిన అనంతరం ప్రతి కుటుంబానికి ఒక ఆస్తికి సంభందించిన కార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు మహేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



సర్వే పనులను పరిశీలిస్తున్న సహాయ సంచాలకులు

# ఆటలవల్ల స్నేహసంబంధాలు బలపడుతాయి



పూడూరులో టాస్‌వేసి బాలికల ఖోఖో ఆటను తిలకిస్తున్న తహశీల్దారు విజయకుమార్,ఎంపిడిఓ పాండు,ఉపాధ్యాయులు తదితరులు

### తహశీల్దారు విజయకుమార్,ఎంపిడిఓ పాండు

**పూడూరు, జనవరి 31, ప్రభాతవార్త :** ఆటలపోటీలు స్నేహసంబంధాలకు ఎంతగానో ఉపయోగ పడుతాయని తహశీల్దారు విజయ్‌కుమార్,ఎంపిడిఓ పాండు పేర్కొన్నారు. పూడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వివిధ గ్రామాల పాఠశాలల విద్యార్థులకు రెండురోజుల పాటు నిర్వహించే మండలస్థాయి సిఎంకప్ ఆటలపోటీల్లో భాగంగా శనివారం టాస్‌వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల్లో పాల్గొనడంవల్ల యువత శరీరకదారుఢ్యంతోపాటు మానసికోల్లాసంగా ఉండే అవకాశం ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సాయిరెడ్డి, వివిధ గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు, పీఈటీలు పలు గ్రామాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సిఎం క్రీడల పోటీలు

**తల కొండపల్లి, జనవరి 31, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సిఎం కప్పు క్రీడల పోటీలు శనివారంనాడు ముగిసాయి. ఈ పోటీలలో వాలీబాల్, కబడ్డీ, కోకో పోటీలకు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన ఆటల పోటీల్లో కోకోలో మొదటి బహుమతి జడ్పిహెచ్ఎస్ గట్టుపల్లి పల్లి, సెకండ్ ప్రైజ్ వెల్జాల్ బాయ్స్ హై స్కూల్, కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి ఖానాపూర్, సెకండ్ బహుమతి అక్షర హై స్కూల్, విద్యార్థినిల విభాగంలో మొదటి బహుమతి ఖానాపూర్ సెకండ్ బహుమతి కస్తూర్బా గాంధీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో చంపుల నాయక్, తహసిల్దార్ రమేష్, ఎంపిడిఓ శ్రీకాంత్, స్థానిక సర్పంచ్ శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ జోతయ్య బిజెపి మండల అధ్యక్షులు తిరుమణి రవి గౌడ్, నాయకులు వెంకటేష్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

## మర్పల్లిలో సిఎం కప్ టోర్నమెంట్ ప్రారంభం

**మర్పల్లి, జనవరి 31, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఉర్దుమీడియం పాఠశాలలో సిఎం కప్ టోర్నమెంట్ మండల స్థాయి క్రీడా పోటీలను స్థానిక సర్పంచ్ రమేష్, ఎంపిడిఓ శ్రీనివాస్ టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. మండలంలోని అండర్ 14, అండర్ 16, అండర్ 19 క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. కోకో, కబ్బడి, వాలీబాల్, రన్నింగ్ శాట్‌పుట్ వంటి క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీకక ధృడత్వంతో పాటు స్నేహాభావాలు పెంపొందుతాయన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణారావు కార్యదర్శి లక్ష్మికాంత్ ఆయా పాఠశాలల పిఇటీలు విద్యార్థులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లి,క్రీడలు ప్రారంభించిన సర్పంచ్

## క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనాలి

మండల విద్యాశాఖ అధికారి

**చేవెళ్ల, జనవరి 31, ప్రభాతవార్త :** చన్వెల్లి గ్రామంలో సిఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పురన్ దాస్, ఎస్సై వనం శిరీష, గ్రామ సర్పంచి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ దీపక్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సంధ్య తదితరులు హాజ రయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు అత్యంత అవసరమని . మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవ డంతో పాటు క్రమంతప్పకుండా క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచిం చారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే గెలుపోటములను సమానంగా స్వీకరించా లన్నారు. ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా మరింత కృషి చేసి విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో దోహదపడిందని గ్రామ పెద్దలు తెలిపారు.





గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేసిన అధికారులు

## ముగిసిన మండలస్థాయి సిఎం కప్ పోటీలు

**చౌడపూర్ , జనవరి 31, ప్రభాతవార్త :** చౌడాపూర్ మండల కేంద్రం జిల్లా పరిషథ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సి.ఎం కప్ క్రీడా పోటీలు అట్టహాసంగా ముగిసాయి. సీ.ఎం. కప్ క్రీడా పోటీలు విద్యార్థుల్లో దాగున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి దోహద పడుతాయని , పల్లె నుంచి మండల ,జిల్లా స్థాయిలో విద్యార్థులు రాణించాలని ఎంఈఓ రాంచందర్, ఎంపిడిఓ సోమలింగం అన్నారు.. శనివారం ముగిసిన మండలస్థాయి సిఎంకప్ లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.. డి.టి. షాఫలి, ప్రధానోపాధ్యాయులు ఇంచార్జ్ మల్లికార్జున్, సర్పంచ్ నవీన్ కుమార్, పిఈటిలుఇసాక్, బాలమణి, పంచాయతీ సెక్రెటరీ రాజిరెడ్డి , యువకులు పాల్గొన్నారు.



నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

## క్రీడలలో గెలుపోటములు సహజమే

యంపిడిఓ రతన్‌సింగ్

**పెద్దేముల్, జనవరి 31, ప్రభాతవార్త:** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సిఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని యంపిడిఓ రతన్‌సింగ్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సిఎం కప్ పోటిలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా యంపిడిఓ రతన్‌సింగ్, పెద్దేముల్, ఓంలానాయక్ తాండా సర్పంచ్‌లు డివై నర్సిములు, సుమిత్ర రాథోడ్‌లు, ఎస్ఐ శంకర్ మాట్లాడుతూక్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని అన్నారు. అంతేగాకుండా క్రీడలతో స్నేహ సంబందాలు బలపడతాయని అన్నారు. క్రీడాకారుల లో దాగియున్న నైపుణ్యం వెలికితీసేందుకు ప్రభుత్వం సిఎం కప్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభావంతులైనక్రీడాకారులను గుర్తించేందుకు సిఎం కప్ పోటిలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమేనని, గెలుపు ఓటమికి నాంది అనిఅన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన సిఎం కప్ పోటిలలో అర్హత సాధించిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటిలకు ఎంపిక చేసామనిఅన్నారు. వాలిబాల్‌లో పాషపూర్ టీమ్, కబడ్డిలో మంబాపూర్ టీమ్ విజేతలుగా నిలిచారు. మిగతా ఆయా క్రీడలలో గెలుపొందిన విజేతలకు బహుమతులనుఅందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలప్ప, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, మాజీ వార్డు మెంబర్ సత్తార్, హెచ్ఎం సునితా, పీఈటిలు రాధక్రిష్ణ, మధు, క్రిష్ణయ్య, ప్రశాంత్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, రాము, ప్రమోద్, గోపిక తదితరులు పాల్గొన్నారు.



కబడ్డిలో విజేతగా నిలిచిన మంబాపూర్ టీమ్

## సీఎం కప్ విజేతలకు బహుమతుల ప్రధానం

**ధారూరు, జనవరి 31, ప్రభాతవార్త :** ధారూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) మైదానంలో ఉత్సాహంగా నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన క్రీడాకారులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) నర్సింలు బహుమతుల ు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో, తహశీల్దార్ సజీదా బేగం, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న ప్రతిభ ను వెలికితీయడానికి ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా, మానసిక ఉల్లాసానికి, యువత క్రమశిక్షణతో మెలగడానికి తోడ్పడతాయని వారు అభిప్రాయపడ్డారు. యువత చదువుతో పాటు క్రీడల్లో నూ రాణించి ఉన్నత శిఖరాల ు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ధారూర్ సర్పంచ్ ప్రమీల చిన్నయ గౌడ్, ఉప సర్పంచ్ జంగీర్, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.





బహుమతులు ప్రధానం చేస్తున్న ఎంపిడిఓ

## దోమ మండలంలో ముగిసిన సిఎం కప్ పోటీలు

పోటో.01.రైటప్.కప్‌లు అందిస్తున్న ఎంపిడిఓ గ్యామా

**దోమ.జనవరి 31 ప్రభాతవార్త :** కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సిఎం కప్ పోటీలు రెండు రోజులుగా ఘనంగా జరిగాయి. ఈ పోటీలను ఎంపిడీవో, ఎంఈఓ వెంకట్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు గౌడ్, గ్రామ సర్పంచ్ మాలి శివకుమార్‌రెడ్డి ప్రారంభించారు .వివిధ పాఠశాల గ్రామాలకు చెందిన విద్యార్థులు యువకులు ఆటలలో పాల్గొనిపోటీలను విజయవంతం చేశారు. గెలిచిన వారికి శనివారం నాడు ఎంపిడీఓ గ్యామ బహుమతిప్రధానం చేశారు. ఆటల పోటీలలో పాల్గొన్న అందరికీ రెండు రోజుల భోజన వసతి సౌకర్యాన్ని గ్రామ సర్పంచ్ మాలి శివకుమార్‌రెడ్డి సమకూర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూక్రీడలు శారీరక మానసిక వికాసానికి దోహదం చేస్తాయని తెలియజేశారు. సీఎంకప్ క్రీడలలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారిలో వాలీబాల్ బాయ్స్‌లో ప్రథమ బహుమతి అయినాపూర్, రెండవ బహుమతి కిష్టాపూర్. గర్ల్స్ విభాగంలో అయినాపూర్ ఫస్ట్, సెకండ్ బొంపల్లి. కబడ్డీ ఫస్ట్ ప్రైస్ దిర్సంపల్లి, సెకండ్ ప్రైస్ మోత్కూర్. కబడ్డీ గర్ల్స్ ఫస్ట్ ప్రైస్ కేజీబీవీ, సెకండ్ ప్రైస్ దోమ. ఖోఖో బాయ్స్ దిర్సంపల్లి ఫస్ట్ ప్రైజ్, సెకండ్ ప్రైజ్ దాదాపూర్. ఖోఖో గర్ల్స్ ఫస్ట్ ప్రైజ్ దిర్సంపల్లి, సెకండ్ ప్రైజ్ మోత్కూర్. గెలిచిన అందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమములో పిడిలు సత్యయ్య, క్రిష్ణమూర్తి, వెంకట్‌రాములు, నర్సిములు, అయినాపూర్ పాఠశాల ప్రదానోపాధ్యాయులు బాబుచంద్, విద్యార్థులు పాల్గొన్నారు.



## నామినేషన్‌ల సూక్ష్మ పరిశీలన జాగ్రత్తగా పరిశీలించాలి

ఎన్నికల అబ్జర్వర్ రవి

**కొడంగల్, జనవరి 31, ప్రభాతవార్త:** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్‌ల సూక్ష్మ పరిశీలన జాగ్రత్తగా పరిశీలించాలని ఎన్నికల అబ్జర్వర్ జి.రవిఐఎస్ అధికారులకు ఆదేశించారు. శనివారం కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్‌ల సూక్ష్మ పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్‌లను ఎక్కడ ఎలాంటి పొరపాటు జరుగకుండా పూర్తిస్థాయిలో పరిశీలించాలని, ఎన్నికలకు ధరఖాస్తు చేసిన అభ్యర్థుల పత్రాలు ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా డాక్యుమెంట్లు ఉన్నాయా లేదా జాగ్రత్తగా నిబం ధన బద్దంగా పరిశీలించాలని అన్నారు. వార్డు వారిగా ఎన్ని ధరఖాస్తులు వచ్చాయి. ఏవైనా వార్డులు ఏకగ్రీవం అయ్యాయా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ ,ఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్‌ల సూక్ష్మ పరిశీలనలను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్

## తాండూరులో ముగిసిన నామినేషన్ల పరిశీలన

-- 36 వార్డులకు 183మంది అభ్యర్థులు 273 నామినేషన్లు

తాండూరు, జనవరి 31, ప్రభాతవార్త : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ఘట్టం పూర్తయింది. తాండూరులోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన నామినేషన్ల పరిశీలనలో ఎన్నికల అధికారులు ఒక నామినేషన్ తిరస్కరించారు. మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు వివిధ పార్టీల నుంచి 183మంది అభ్యర్థులు 273 నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. నామినేషన్ల పరిశీలనలో పట్టణంలోని 3వ వార్డుకు సబంధించి అభ్యర్థి కులధృవీకరణ పత్రం సమర్పించకపోవడంతో నామినేషన్ తిరష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తాండూరు మున్సిపల్ పరిధిలో 36 వార్డులకు సంబంధించి వివిద పార్టీల నుంచి 183మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 55, బిఆర్ఎస్ పార్టీ నుంచి 59, బిజెపి నుంచి 36, ఎంఐఎం నుంచి 15, బీఎస్పీ నుంచి 1, ఇతర పార్టీల నుండి7, స్వతంత్రులుగా 10మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించినట్లు ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు.



నామినేషన్ల పరిశీలనలో పాల్గొన్న అభ్యర్థులు.

## అర్హత సాధించిన 109 నామినేషన్లు

**ఆమనగల్లు, జనవరి31, ప్రభాతవార్త:** జనవరి 11న జరగనున్న ఆమనగల్లు మున్సిపాలిటీ నియోజకవర్గ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు దాఖలు చేసిన అన్ని నామినేషన్ సెట్‌లు అర్హత సాధించాయని మున్సిపాలిటీ ఎన్నికల జిల్లా ఉప అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. 15వార్డులకుగాను జనవరి 28 నుండి 30వరకు 72 మంది అభ్యర్థుల నుండి 109 నామినేషన్లు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ నియమావళి ప్రకారం శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో నామినేషన్ల స్క్రూటిన్నీని ఎన్నికల అధికారులు పరిశీలించారు. స్క్రూటిన్నీ విధానంను ఎన్నికల అధికారి శంకర్‌నాయక్ పరిశీలించారు. ఈసంధర్బంగా ఆయన మాట్లాడుతూ స్వీకరించిన నామినేషన్‌లు అన్ని సక్రమంగా ఉన్నాయని, ఏఒక్కటీ తిరస్కరణకు గురికాలేదని తెలిపారు.



స్క్రూటిన్నీని పరిశీలిస్తున్న ఎన్నికల జిల్లా ఉప అధికారి శంకర్‌నాయక్

## ఎల్లంపేట మున్సిపాలిటీలో రెండు నామినేషన్ల తిరస్కరణ

**మేడ్చల్, జనవరి 31. ప్రభాతవార్త :** మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా ఎల్లంపేట మున్సిపాలిటీలో వేసిన 214 నామినేషన్లల్లో శనివారం నిర్వహించిన పరిశీలనలో రెండు నామినేషన్లు రిజెక్ట్ అయ్యాయి. అందులో మున్సిపల్ 1వ వార్డులో నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి సక్కులత నామినేషన్, 8వ వార్డులో బీఆర్ఎస్ నుండి నామినేషన్ వేసిన మాలోత్ రజిత రెండో నామినేషన్ సెట్ రిజెక్ట్ అయ్యినట్లు అధికారులు తెలిపారు. శనివారం రిజెక్ట్ అనంతరం 212 నామినేషన్లు ఉండగా అందులో 37 బీజేపీ అభ్యర్థుల నామినేషన్లు, 66 కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు, 58 బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్లు, 6 రిజిస్ట్రేషన్ ఉన్న ఇతర పార్టీ నామినేషన్లు, 45 ఇండిపెండెంట్లు వేసిన నామినేషన్లు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

## మున్సిపాల్టీల ఎన్నికల్ల నామినేషన్ల పరిశీలన పూర్తి

..అలియాబాద్ మున్సిపాల్టీలో 94నామినేషన్లు

..మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో174 నామినేషన్లు

..నామినేషన్ల ఉపసంహరణకు

ఫిబ్రవరి 3వ తేదీ గడువు

**శామీర్‌పేట, జనవరి 31, ప్రభాతవార్త:** మున్సిపాల్టీల ఎన్నికల నామినేషన్ల పరిశీలన (స్క్రూట్నీ) జరిగిన తరువాత అలియాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులకు సంబంధించి 94నామినేషన్లు సక్రమంగా ఉండగా, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 24వార్డులకు సంబంధించి 174 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఆయా కమిషనర్లు చంద్రశేఖర్, పవన్‌కుమార్‌లు పేర్కొన్నారు. శనివారం ఆయా మున్సిపాల్టీలలో నామినేషన్ల పరిశీలన (స్క్రూట్నీ) కార్యక్రమం జరిగింది. అయితే అలియాబాద్ మున్సిపాల్టీల్లో మూడు రోజుల పాటు జరిగిన మున్సిపల్ నామినేషన్ల స్వీకరణలో 144నామినేషన్లు అందగా వీటిలో 94నామినేషన్లు సక్రమంగ ఉన్నట్లు ప్రకటించారు. మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో మూడు రోజులలో 175నామినేషన్లు అందగా వీటిలో 1నామినేషన్ మాత్రం తిరస్కరణ జరిగి 174 నామినేషన్లు సక్రమంగ ఉన్నట్లు తెలిపారు. ఇక ఫిబ్రవరి 3వ తేదీ 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు ఉంది. ఈ మూడు రోజులలో నామినేషన్లు వేసి ఒక వేళ పోటీలో ఉండని నామినేషన్ విరమించుకోవటానికి అవకాశం ఉందని చెప్పవచ్చు. ఆ తరువాత బరిలో ఉన్న వారికి గుర్తుల కేటాయింపు జరుగనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ...

## కాంగ్రెస్ మైనార్టీ నేత దావూద్ ఆగ్రహం

**ధారూరు, జనవరి 31, ప్రభాతవార్త :** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరుపై ధారూర్ మండల కాంగ్రెస్ మైనార్టీ నాయకులు దావూద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేడారం జాతరలో భాగంగా విధుల్లో ఉన్న పోలీస్ కమిషనర్ గౌస్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే చేసిన మతపరమైన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని ఆయన మండిపడ్డారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, నిష్పక్షపాతంగా పనిచేసే అధికారుల ు వారి మతం పేరుతో దూషించడం కౌశిక్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని, ఇది ముస్లిం సమాజం మనోభావాల ు తీవ్రంగా గాయపరిచిందని దావూద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం అధికారుల ు కించపరిచేలా మాట్లాడిన కౌశిక్ రెడ్డి, రేపు జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో ఏ ముఖం పెట్టుకుని ముస్లింల దగ్గరకు వచ్చి ఓట్లు అడుగుతారని ఆయన నిలదీశారు. రాజకీయ లబ్ధి కోసం మతాల ు వాడుకోవడం మా నుకోవాలని, అధికారి గౌరవాన్ని భంగపరిచినందుకు ఎమ్మెల్యే వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో మైనార్టీల సత్తా ఏంటో చూపిస్తామని, కౌశిక్ రెడ్డికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతామని దావూద్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## వివాహిత అనుమానాస్పద మృతి

**దుద్యాల్, జనవరి 31, ప్రభాతవార్త :** అనుమానస్పదంగా వివాహితమృతి చెందిన ఘటన దుద్యాల మండలంలోని పోలేపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాయిగడ్డ నరేందర్ రెడ్డితో మాధురి (25) వివాహం గత అక్టోబర్ నెలలో జరిగింది. మాధురి శని వారం బట్టలు ఉతకడానికి తమ సొంత పొలంలో ఉన్న భావి గుంతదగ్గర బట్టలు ఉతుకుతుండగా, ఫిడ్స్ వచ్చి, గుంతలోపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెబు తున్నారు. విషయం తెలుసుకొని ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి జానకి తన కూతురు మృతి అ నుమానస్పదంగా ఉందని భావించి, పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీశైలం తెలిపారు.

